సాక్షి కామారెడ్డి

గురువారం । 18 । మే । 2023



31లోగా మిల్లింగ్ పూర్తవ్వాలి

ఈనెల 31వ తేదీలోగా రైస్‌మిల్ యజమానులు మిల్లింగ్ పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.
- 8లో ▸



ఆడపిల్లలను విక్రయిస్తే కేసులు

ఆడపిల్లలను విక్రయిస్తే కేసులు నమోదు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు దేవయ్య ఆదేశించారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
41.3 /28.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి ఎండతీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా కేంద్ర, బాన్సువాడ ప్రభుత్వ ఏరియా, దోమకొండ సీహెచ్‌సీ ఆస్పత్రులతో ఖాళీలుగా ఉన్న వైద్యుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నాలుగు, బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో ఒకరు, సీహెచ్‌సీ దోమకొండలో ఇద్దరు వైద్యులు ఖాళీలుగా ఉన్నాయని తెలిపారు. ఎంబీబీఎస్, ఏదైనా స్పెషలిస్ట్ అర్హత కలిగిన వైద్యులు కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేస్తామన్నారు. ఈనెల 22వ తేదీ లోపు దరఖాస్తులను జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

గేటు మధ్యలో నిలిచిపోయిన రైలు

- ఇబ్బందులు పడ్డ వాహనదారులు



కామారెడ్డి అర్బన్ : సాంకేతిక లోపంతో గేటు మధ్యలో రైలు నిలిచిపోవడంతో కామారెడ్డి పట్టణం అశోక్‌నగర్ వద్ద 15 నిమిషాలు ఇరువైపులా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తిరుపతి–నిజామాబాద్ రాయలసీమ ఎక్స్‌ప్రెస్ బుధవారం ఉదయం దాదాపు రెండు గంటలు ఆలస్యంగా ఉదయం 9–30 గంటలకు వచ్చింది. అనంతరం కామారెడ్డి స్టేషన్ నుంచి నిజామాబాద్ వైపు రైలు కదులుతుండగా సాంకేతిక లోపం ఏర్పడి అశోక్‌నగర్ గేటు వద్ద 15 నిమిషాల పాటు నిలిచిపోయింది. దీంతో ఉదయం పూట ఆఫీసులు, మార్కెట్ ఇతర అత్యవసర పనులపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందుల పడ్డారు. కొందరు గత్యంతరం లేక రెండు కిలోమీటర్ల దూరంలోని పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా వెళ్లారు.

గ్రామీణ క్రీడాకారులకు చక్కటి అవకాశం



బాన్సువాడ : గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు సీఎం కప్ క్రీడలు చక్కటి అవకాశమని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడలో నిర్మించిన మినీ స్టేడియంలో ఎంతో మంది క్రీడాకారులు వచ్చి పోటీలకు హాజరవుతున్నారన్నారు. సీఎం కప్ క్రీడల్లో వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి మిర్జాపూర్ జట్టు, ద్వితీయ బహుమతి రాముల గుట్ట తండా జట్టు సాధించడంతో క్రీడాకారులకు స్పీకర్ బహుమతులు అందజేశారు. ఆర్డీవో రాజాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మాజిద్, ఎంపీపీ విఠల్, నాయకులు శ్రీనివాస్, కిషోర్‌యాదవ్, ఆర్‌ఐ అంజనేయులు ఉన్నారు.

ముగిసిన పాలిసెట్



కామారెడ్డి టౌన్ : పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించిన పాలిసెట్ 2023 ప్రవేశ పరీక్ష కామారెడ్డిలోని నాలుగు కేంద్రాల్లో ప్రశాంతంగా విజయవంతంగా జరిగింది. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్, సైన్స్ కళా శాల, ఎస్ఆర్‌కే డిగ్రీ, సాందీపనీ డిగ్రీ, మంజీరా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాలలో పరీక్ష నిర్వహించారు. మొత్తం 2518 విద్యార్థులకు గాను 2412 విద్యార్థులు హాజరు కాగా 106 గైర్హాజరయ్యారు. 95.79 హాజరుశాతం నమోదైంది. బాలురు 96.65, బాలికలు 94.84శాతం హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. డీఎస్పీ సురేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. జిల్లా సమన్వయకర్త డాక్టర్ కే. కృష్ణయ్య, సహాయ సమన్వయకర్త డాక్టర్ శంకరయ్య, సాంకేతిక విద్యాశాఖ అధికారులు రమాకాంత్, రవికాంత్ రెడ్డి, సుధాకర్ పరీక్ష కేంద్రాలను సమన్వయం చేశారు. పరీక్షల నిర్వహణ అధికారి లింగం, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పరీక్షలను పర్యవేక్షించారు. 10 గంటలకే పరీక్షా కేంద్రాలకు విద్యార్థు లు చేరుకున్నారు. విద్యార్థుల వెంట వచ్చి న తల్లి తండ్రులు ఎండలో ఇబ్బందులు పడ్డారు.





కామారెడ్డిలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రోడ్డు

నిప్పుల కుంపటి!

- ఎండలతో రోడ్లన్నీ నిర్మానుష్యం
- ఆస్పత్రులపాలవుతున్న జనం
- జిల్లా అంతటా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

జిల్లా వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం బయట అడుగు బయటపెట్టలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గడచిన వారం రోజులుగా జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. పగటిపూట జనం బయట తిరగడం లేదు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యమవుతున్నాయి.

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్ : జిల్లా అంతటా 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రాత్రి పది దాటినీ వేడిగాలులు తగ్గడం లేదు. ఎండల వేడి దానికి తోడు ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు విలవిల్లాడుతున్నారు. రోజు రోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. ఉదయం 8 గంటలకు భగభగమంటూ సూరీడు జనానికి చుక్కలు చూపిస్తున్నాడు. పగటిపూట అయితే పరిస్థితి ధారుణంగా ఉంటుంది. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. చాలా ప్రాంతాల్లో 42 డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో ఎండలను తట్టుకోలేక చాలా మంది అస్వస్థతకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ఎండలతో అల్లాడిపోతు న్నారు. కొందరు నీరసించిపోగా ఆస్పత్రులకు తరలిస్తున్నారు. మద్నూర్, డోంగ్లీ, బాన్సువాడ, గాంధారి, కామారెడ్డి, భిక్కనూరు, పిట్లం,తాడ్వాయి, లింగంపేట, జుక్కల్, నస్రుల్లాబాద్, ఎల్లారెడ్డి, ని జాంసాగర్, మాచారెడ్డి తదితర మండలాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎండలతో వాహ



నాలు కూడా మొరాయిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలే కాక కార్లు, జీపులు కూడా వేడితో ఇంజన్ హీటెక్కుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు.

పగటిపూట కర్ఫ్యూ వాతావరణం

ఎండల తీవ్రత పెరగడంతో జిల్లా అంతటా పగటిపూట కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. ప్రధాన రోడ్లపై వాహనాలు కూడా తిరగడం లేదు. జిల్లా కేంద్రంలో జనం తిరగక రోడ్లన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయి. దీంతో పొద్దంతా దందాలు నడవడం లేదని వ్యాపారులు అంటున్నారు. అయితే వడగాలులు రాత్రి పది దాటినా తగ్గడం లేదు. అర్ధరాత్రి దాటితేగానీ వాతావరణం చల్లబడడం లేదు. ఉక్కపోతతో జనం నిద్ర కూడా సరిగా పోవడం లేదు. పగలు, రాత్రి ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు నడుస్తున్నా వేడి తగ్గకపోగా, వేడి గాలి వస్తోందంటున్నారు.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు	
తేది	ఉష్ణోగ్రత
12న శుక్రవారం	42.4
13న శనివారం	43.8
14న ఆదివారం	44.5
15న సోమవారం	41.8
16న మంగళవారం	42.2
17న బుధవారం	42

అల్లాడిపోతున్న జనం

ఎండల తీవ్రత పెరిగి జనం అల్లాడిపోతున్నారు. బయట తిరగలేక ఇళ్లల్లోనే ఉంటున్న వారు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. పిల్లలైతే ఉక్కపోత భరించలేకపోతున్నారు. వృద్ధులదీ దయనీయ పరిస్థితి. ఉదయం నుంచే ఎండ దంచికొడుతుండడం, సాయంత్రం వరకూ తగ్గకపోవడంతో వేడి రాత్రి వరకూ ఉంటోంది. గడపదాటి బయకు వస్తే చాలు రోడ్లపై వడగాలి ఒక వైపు, రోడ్డు మీద వేడి మరోవైపు ఇబ్బంది పెడుతున్నాయి. యాసంగి వరి కోతలు, ధాన్యం కేంద్రాలకు తరలించడం, ఆరబెట్టడం వంటి పనులు కొనసాగుతున్నాయి. అలాగే మక్క కోసిన రైతులు మక్కలను ఒలిచి ఆరబెడుతున్నారు. దీంతో రైతులు, కూలీలు ఎండతో ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది ఆస్పత్రుల పాలవుతున్నారు.



గొడుగు పట్టుకుని పండ్లు విక్రయిస్తున్న మహిళ

గర్భిణులు నీళ్లు ఎక్కువ తాగాలి..



ఈ ఎండకాలంలో ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు చాలా జాగ్రత్తలు పాటించాలి. వీరు చల్లని వాతావరణంలో ఎక్కువగా ఉండాలి. ఎక్కువగా నిద్ర పోవాలి. ఎండలో ఎక్కువ సేపు తిరిగితే అబార్షన్ అయ్యే అవకాశాలున్నాయి. సమతుల్య ఆహారం, ఐరన్, కాల్షియం ఎక్కువగా తీసుకోవాలి. 4 లీటర్లకు పైగా నీరు తీసుకోవాలి లేకుంటే మూత్రంలో ఇన్‌ఫెక్షన్ అవుతుంది. సీజేరియన్ అయిన బాలింతలు చల్లడి వాతవరణంలో ఉండాలి లేకుంటే కుట్లు మానకుండా ఇన్‌ఫెక్షన్ అవుతుంది.

– డాక్టర్ విజయలక్ష్మి, గైనకాలజిస్ట్, కామారెడ్డి

పిల్లలకు తల్లిపాలు ఇవ్వాలి



శిశువులకు వడదెబ్బ తగలకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి వాతవరణంలో ఉండాలి. వేడిగాలి తగలకుండా చూడాలి. ఎండాకాలంలో శిశువులకు ఎక్కువగా తల్లిపాలే తాగించాలి. శరీరం వేడిగా ఉండకుండా తడి గుడ్డతో తుడవాలి. జ్వరంగా ఉంటే తక్షణమే వైద్యున్ని సంప్రదించాలి. చిన్నపిల్లల్ని ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు పంపించవద్దు. నీరు ఎక్కువగా ఇవ్వాలి. ఫ్రూట్ జ్యూస్, ఓఆర్‌ఎస్ తీసుకోవాలి.

– డాక్టర్ శ్రీనివాస్, పిల్లల వైద్య నిపుణులు, కామారెడ్డి

జాగ్రత్తలు పాటించాలి..



ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగవద్దు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు చాలా జాగ్రత్తలు పాటించాలి. వడదెబ్బ తగిన వారికి జ్వరం, పొడి చర్మం, అసలు చమట రాదు, నీరసం, వాంతులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. తడిసిన దుప్పటి కప్పాలి. ఎక్కువగా నీరు, పండ్ల రసాలు, గంజి, అంబలి, ఓఆర్‌ఎస్ తీసుకోవాలి. ప్రతీ ఒక్కరు రోజు 4 నుంచి 8 లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి.

– డాక్టర్ సమీనా, ఎండో ఫిజీషియన్, కామారెడ్డి



కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వీవోఏలు

కదం తొక్కిన వీవోఏలు

కామారెడ్డి క్రైం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న వీవోఏలు బుధవారం కలెక్టరేట్ ముట్టడించారు. సమ్మెలో భాగంగా బుధవారం జిల్లా నలుమూలల నుంచి దాదాపు వెయ్యి మంది వరకు కలెక్టరేట్‌కు తరలి వచ్చి ధర్నాలో పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా కేవలం రూ.3,900లకే ఉద్యోగం చేస్తున్నామ ని తెలిపారు. తమను సెర్ప్ ఉద్యో గులుగా గుర్తించాలని, నెలకు రూ.26 వేల కనీసం వేతనం ఇవ్వాలని, ప్రతి వీవోఏకు రూ.10 లక్షల సాధారణ బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దాదాపు రెండు గంటలకు పైగా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అనంతరం వీవోఏల సంఘం ప్రతినిధులు కలెక్టరేట్‌లోకి వెళ్లి డీఆర్‌డీవో సాయన్నకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు వెనుదిరిగారు.

ఇక ద్రవరూప డీఏపీ

- బస్తాల బరువు, రవాణా వ్యయాలకు అడ్డుకట్ట
- రైతులకు తప్పనున్న ఇక్కట్లు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : రైతన్నకు బస్తాల భారం తగ్గించాలనే ఉద్దేశ్యంతో ఎరువుల కంపెనీలు ద్రవరూప డీఏపీని సరఫరా చేయడానికి సిద్ధమయ్యాయి. దీంతో మోత బరువులు, రవాణ వ్యయం తగ్గనుంది. ఇఫ్‌కో(ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కో–ఆపరేటివ్ లిమిటెడ్) నానో డీఏపీ ద్రవ రూప ఎరువును రైతులకు అందుబాటులోకి తెచ్చింది. గత నెల 26న ఢిల్లీలో మార్కెట్‌లోకి విడుదల చేశారు. ప్రపంచంలోనే తొలిసారిగా డీఏపీని ద్రవ రూపంలో విడుదల చేస్తున్నారు. రైతులు ఎకరానికి రెండు బస్తాల డీఏపీ బదులు నానో డీఏపీ వినియోగిస్తే పెట్టుబడి ఎకరానికి సగటున రూ. 5 వేలు తగ్గే అవకాశముంది.

సీజనల్ వ్యాధులను కట్టడి చేయాలి

- పారిశుధ్య వారోత్సవాలను పకడ్బందీగా చేపట్టాలి
- పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ

కామారెడ్డి రూరల్/తాడ్వాయి/రాజంపేట : సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందని పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన పారిశుధ్య వారోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాలు ఈనెల 23 వరకు కొనసాగుతాయన్నారు. పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా బుధవారధ్యాయన కామారెడ్డి మండలంలోని గర్గుల్, తాడ్వాయిలోని ఎర్రపహాడ్‌లో, రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని కంపోస్ట్ షెడ్, నర్సరీ, క్రిమిటోరియం, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, సానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లను పరిశీలించారు. గ్రామంలో సానిటేషన్, డంపింగ్ యార్డు, శ్మశానవాటిక, రోడ్లు, డ్రెయినేజీ, దోమల నివారణ తదితర అంశాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎల్‌పీవో సాయిబాబా, సర్పంచ్‌లు, చింతల రవితేజగౌడ్, బొక్కా నర్సారెడ్డి, ఎంపీవోలు మలహరి, హెప్సీబారాణి, రఘురాం, ఎర్రాపహాడ్ ఉపసర్పంచ్ బాలాజీ, కార్యదర్శులు శోభ, అరుణ్, ఎస్‌బీఎం నారాయణ తదితరులు ఉన్నారు.



గర్గుల్‌లో కంపోస్ట్ షెడ్‌ను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ

ఏ సంచిలో ఏముందో..?

- కలెక్టరేట్లో కలకలం రేపుతున్న ఆత్మహత్యాయత్నాలు..
- అరకొరగా పోలీసు భద్రత
- కనీసం సీసీ కెమెరాలు లేని వైనం
- తలలు పట్టుకుంటున్న భద్రతా సిబ్బంది



కామారెడ్డి క్రైం : పేరుకు కామారెడ్డి కలెక్టరేట్.. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం.. నిత్యం వందల సంఖ్యలో జనం వచ్చిపోతుండే ప్రాంతమిది. ఇక సోమవారమైతే రద్దీ మామూలుగా ఉండదు. ఇలాంటి అతి ముఖ్యమైన కార్యాలయానికే ప్రస్తుతం భద్రత ప్రశ్నార్థకంగా మారింది. కార్యాలయానికి నిత్యం వచ్చే ఫిర్యాదుదారులు తమ సంచుల్లో ఎప్పుడు ఏం తీసుకొస్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో కార్యాలయ, భద్రతా సిబ్బంది, భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు. తమ పనుల నిమిత్తం కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయిన జనం నేరుగా కలెక్టరేట్‌కు పురుగుమందు డబ్బాలు, పెట్రోల్ డబ్బాలు, యాసిడ్ బాటిళ్లు వెంట తెచ్చుకొని ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతుండడం నిత్యకృత్యంగా మారింది.

వరుస ఘటనలు..

కామారెడ్డి కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నాలకు సంబంధించిన వరుస ఘటనలు ఇటీవల వెలుగు చూశాయి. పాత కలెక్టరేట్‌లో రెండేళ్లక్రితం ఓ వ్యక్తి తన భూసమస్యను అధికారులు పరిష్కరించడం లేదని ఆరోపిస్తూ ఏకంగా అప్పటి కలెక్టర్ శరత్ ఎదుటే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. నూతన కలెక్టరేట్ భవనంలో కూడా నాలుగు ఘటనలు జరిగాయి. గాంధారికి చెందిన కామెల్లి కృష్ణ అనే యువకుడు తన సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదంటూ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యతి ్నంచగా ఎస్సై ఉదయ్ శేఖర్ అడ్డుకున్నారు. మార్కెట కమిటీలో జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేస్తే అక్కడి నాయకులు, పోలీసులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ జుక్కల్‌కు చెంతిన ఓ యువకుడు రెండు నెలల క్రితం కలెక్టరేట్‌కు వచ్చి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. 10 రోజుల క్రితం దోమకొడ మండలం ముత్యంపేటకు చెందిన ఓ కుటుంబం పురుగు మందు డబ్బాతో కలెక్టేట్‌కు వచ్చింది. తమ భూమి సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదంటూ పురుగుల మందు తాగి ఇక్కడే చనిపోతామని భీష్మించగా పోలీసులు నచ్చజెప్పి పంపించారు. మొన్నటికి మొన్న ప్రజావాణికి వచ్చిన ఓ మహిళ సంచిలో యాసిడ్ బాటిల్‌ను పోలీసులు గుర్తించి ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.



పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన గాంధారి యువకుడిని అడ్డుకున్న పోలీసులు(ఫైల్)



పురుగుమందు డబ్బాతో వచ్చిన ముత్యంపేటకు చెందిన కుటుంబం (ఫైల్)

నిఘా ఏదీ..?

కామారెడ్డి నూతన కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించి దాదాపు రెండేళ్లు కావస్తుంది. ఇక్కడ ఆయా శాఖలకు సంబంధించిన 50కి పైగా జిల్లా కార్యాలయాలు ఉన్నాయి. ఇప్పటికీ ఒక్కటంటే ఒక్క సీసీ కెమెరాను కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో కార్యాలయం ఆవరణలో జరిగే కార్యకలాపాలపై నిఘా పూర్తిగా కరువైంది.

ముగ్గురే పోలీసులట..!

ఇల్చిపూర్ శివారులో నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం పూర్తి చేసి 2021లో కొత్త భవనంలోకి మారారు. కలెక్టరేట్ అంటేనే నిత్యం జిల్లా నలుమూలల నుంచి జనం వస్తుంటారు. అంతేగాకుండా ఆయా పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి, ఇతర సంఘాల ధర్నాలు, ఆందోళనలు ఉంటాయి. అయినప్పటికీ కలెక్టరేట్ భద్రతకు కేవలం ఒక ఎస్సై స్థాయి అధికారితో పాటు ఒక కానిస్టేబుల్, మరో మహిళా కానిస్టేబుల్‌ను మాత్రమే కేటాయించారు. ఇంత పెద్ద వ్యవస్థ భద్రతకు కేవలం ముగ్గురు పోలీసు అధికారులే ఉండటం ఇబ్బందికరంగా మారింది.

సమస్యలను పరిష్కరిస్తాం..



ప్రతి సోమవారం రద్దీగా ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఎక్కువ సంఖ్యలో పోలీసులను ఏర్పాటు చేస్తున్నాం. సీసీ కెమెరాల విషయంలో ఇదివరకే ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. తొందరలోనే ఏర్పాటు చేయిస్తాం. సమస్యలుంటే అధికారులు దృష్టికి తీసుకురావాలి. ఆత్మహత్యాయత్నాలు చేయవద్దు. సమస్యలు పరిష్కరిస్తాం.

– రవీందర్, కలెక్టరేట్ పాలనాధికారి

క్లుప్తంగా

4,599 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో బుధవారం కంటి వెలుగు శిబిరాల్లో 4,599 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. అవసరం అయిన 359 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,18,272 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 61,649 మందికి అద్దాలను అందజేశారు.

ఆవును కాపాడిన గో సేవకులు



సుభాష్‌నగర్: నగరంలోని నాందేవ్‌వాడలో ఓ ఆవు కుళాయి గుంతలో పడిపోయింది. అందులో నుంచి లేవలేని స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా స్థానిక కార్పొరేటర్ ఎర్రం సుధీర్‌కు కాలనీవాసులు సమాచారమిచ్చారు. దీంతో వెంటనే గో సేవకులు వచ్చి ఆవును బయటికి తీసి కాపాడారు. హిందూ ఐక్యవేదిక కన్వీనర్ దాత్రిక రమేష్, హిందువాహిని నగర అధ్యక్షుడు శ్రీకాంత్, క్రాంతి, రాకేష్, శేషు పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీల ఎన్నికలు జరపాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఇంకా 50 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ఎన్నికలు జరపాల్సి ఉందని, హై కోర్టు ఉత్తర్వుల ప్రకారం మూడు నెలల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారి రాజనర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నిక జరగని సహకార సంఘాలు వారి ఓటరు జాబితాను జిల్లా కార్యాలయంలో అందజేసిన పక్షంలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అనంతరం జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘ ఎన్నికలు నిర్వహించడాని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

వడ్లు కొనడం లేదని ధర్నా



డొంకేశ్వర్: నిజామాబాద్ నగర శివారు ప్రాంతంలో మాసాని చెరువు కింద పండిన వడ్లను కొనుగోలు చేయడం లేదని రైతుకేత్ ఆధ్వర్యంలో బుధవారం శివాజీనగర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. తరుగుకు ఒప్పుకుంటేనే ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు చెప్తున్నారని రైతులు ఆరోపించారు. కండిషన్ లేకుండా వడ్లను కొనుగోలు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పుస్తకాల సరఫరా బాధ్యతపై ఎంఈవోల ఆగ్రహం

నిజామాబాద్‌అర్బన్: పాఠ్య పుస్తకాల సరఫరా బాధ్యతపై మండల విద్యాశాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుస్తకాలను జిల్లా కేంద్రం నుంచి మండల రిసోర్స్ కేంద్రాలకు సరఫరా చేయడంలో స్థానిక ఎంఈఓ బాధ్యత తీసుకోవాలని రవాణా ఖర్చులు చెల్లించాలని డీఈవో బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదట ఖర్చు చేసి బిల్లులు పెట్టుకోవాలని పేర్కొన్నారు. దీనికి ఎంఈవోలు ఒప్పుకోవడం లేదు. తర్వాత బిల్లులు రావడంలో ఆ లస్యం అయితే తాము ఇబ్బందులు పడుతామన్నారు. దీనిపై డీఈవో దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా రవాణా ఖర్చులు పెట్టుకొని బిల్లులు సమర్పిస్తే నిధులు విడుదల చేస్తామన్నారు.

త్వరలో వర్సిటీకి కొత్త రిజిస్ట్రార్..

- నేటి నుంచి తరగతులు పునఃప్రారంభం
- పీహెచ్‌డీ అవార్డులపై విచారణకు సిద్ధంగా ఉండాలి
- అధ్యాపకులతో సమావేశంలో వీసీ రవీందర్‌గుప్తా



మాట్లాడుతున్న వీసీ రవీందర్‌గుప్తా

తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి సహకారంతో క్యాంపస్‌కు చెందిన సీనియర్ ప్రొఫెసర్ ఒకరిని త్వరలో కొత్త రిజిస్ట్రార్‌గా నియమిస్తామని వైస్-చాన్స్‌లర్ డి రవీందర్ గుప్తా పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో వర్సిటీ పరిధిలోని మెయిన్ క్యాంపస్ (డిచ్‌పల్లి), సౌత్ క్యాంపస్(భిక్కనూర్), ఎడ్యుకేషన్ క్యాంపస్ (సారంగపూర్)కు సంబంధించిన రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకులతో వీసీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కరోనా కారణంగా విద్యాసంవత్సరం ఆలస్యంగా నడుస్తోందని, వేసవి సెలవులను 12 రోజులు తగ్గిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి జూలైలో పరీక్షల ఫలితాలు ప్రకటించాలని తెలిపిందని, అందుకే సెలవులు తగ్గింపు నిర్ణయం తీసుకున్నట్లు వీసీ పేర్కొన్నారు. అలాగే 2021 నుంచి ఇప్పటి వరకు వివిధ విభాగాల్లో పరిశోధక విద్యార్థులకు అందించిన పీహెచ్‌డీ అవార్డుల పై త్వరలోనే విచారణ జరుగనుందన్నారు. ఆయా విభాగాల గైడ్స్ వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు గైడ్స్ మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగానే పరిశోధకులకు డాక్టరేట్ అవార్డులు ప్రకటించినట్లు తెలిపారు. విద్యార్థి నాయకులలో ఒకరంటే ఒకరికి పడక డాక్టరేట్‌లను వివాదం చేయడం తగదన్నారు. దీనివల్ల సామాన్య విద్యార్థులు నష్టపోతారని, నిరాశకు లోనవుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా త్వరలోనే కొత్త రిజిస్ట్రార్‌ను నియమిస్తామని వీసీ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. వేసవి సెలవులతో ఇళ్లకు వెళ్లిపోయిన విద్యార్థులు ఈ మండే ఎండలకు మళ్లీ వచ్చి తరగతులకు హాజరవుతారా అనేది అనుమానమేనని పలువురు అధ్యాపకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

కొత్త రిజిస్ట్రార్ ఎవరు?

వీసీ అధ్యక్షతన జరిగిన అధ్యాపకుల సమావేశానికి పాలకమండలి ద్వారా రిజిస్ట్రార్‌గా నియామకమైన ప్రొఫెసర్ యాదగిరి హాజరు కాలేదు. యాదగిరి నియామకాన్ని వీసీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈసీ నిర్ణయాన్ని బేఖాతరు చేస్తూ ఓయూకు చెందిన నిర్మలదేవిని తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వీసీ నియమించారు. వీసీ ఒంటెద్దు పోకడలపై ఈసీ సభ్యులు ఆగ్రహించి, తమ అనుమతి లేకుండా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తీర్మానం చేశారు. దీంతో తత్వం బోధపడిన ఆమె ఐదు రోజుల్లోనే సొంత యూనివర్సిటీకి వెళ్లిపోయారు. అలాగే వీసీ ఆర్థిక అక్రమాలు, పీహెచ్‌డీ కుంభకోణాలపై విచారణ కోసం కమిటీని నియమించారు. దీంతో ఎటూ పాలుపోని వీసీ ఏకంగా రిజిస్ట్రార్ కార్యాలయం తాళం తెరవనీయకుండా చేశారు. ప్రభుత్వం ఏదొక నిర్ణయం తీసుకుంటే తప్ప తాను రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చోనని యాదగిరి సొంత విభాగానికే పరిమితమయ్యారు. ఇప్పుడు ఏకంగా వర్సిటీకి చెందిన నలుగురు ప్రొఫెసర్లలో ఒకరిని ఒప్పించి ఈసీ సహకారంతో కొత్త రిజిస్ట్రార్‌గా నియమించాలని వీసీ ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో రిజిస్ట్రార్ కుర్చీలాట ఇప్పుడప్పుడే ముగిసేలా లేదని వర్సిటీ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. తెయూలో ఇంత జరుగుతున్నా ప్రభుత్వం సరైన రీతిలో స్పందించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈసీ సభ్యుల మద్దతు కోసం..

- రిజిస్ట్రార్‌గా సీనియర్ ప్రొఫెసర్ ఎం అరుణ నియామకం కోసం వీసీ ప్రయత్నాలు



తెయూ ఈసీ సభ్యులు రాజేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ రవీందర్

తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి కొత్త రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఎం అరుణను నియమించడానికి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డి రవీందర్ గుప్తా ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ మేరకు వీసీ పాలకమండలి (ఈసీ) సభ్యులను కలిసి మద్దతు కోరుతున్నారు. బుధవారం ఈసీ సభ్యులు ప్రముఖ న్యాయవాదులు రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఎల్‌శాస్త్రిలను కలిశారు. అనంతర వీసీ 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఈసీ తీర్మానించినప్పటికీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరికి ఆర్డర్ లేకపోవడంతో ఆయన నియామకం చెల్లదన్నారు. అందుకే తెయూలో ప్రస్తుతం పరీక్షల నియంత్రణాధికారి (కంట్రోలర్) గా విధులు నిర్వహిస్తున్న సీనియర్ ప్రొఫెసర్ ఎం అరుణను రిజిస్ట్రార్‌గా నియమించాలనుకుంటున్నట్లు తెలిపారు.

ఇందుకోసం సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వాకాటి కరుణను హైదరాబాద్‌లో కలిశానన్నారు. ఈసీ సభ్యులను ఒప్పించాలని ఆమె సూచించారన్నారు. ఈసీ సభ్యులు వసుంధరదేవి, మారయ్యగౌడ్, గంగాధర్‌గౌడ్ లను ఫోన్‌లో సంప్రదించాలని ప్రయత్నించానని వారు స్పందించలేదన్నారు. మిగిలిన సభ్యులు ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, ప్రొఫెసర్ నసీమ్‌లు అందుబాటులో లేరన్నారు. ఒకటి రెండు రోజుల్లో మిగిలిన ఈసీ సభ్యులను వ్యక్తిగతంగా కలిసి వారి సహకారం కోరతామని వీసీ తెలిపారు. ఈ విషయమై ప్రొఫెసర్ అరుణను సంప్రదించగా వీసీ తనను రిజిస్ట్రార్‌గా పనిచేయాలని అడిగిన మాట వాస్తవమేనన్నారు. అయితే పాలకమండలి ఆమోదం ఇస్తేనే తాను రిజిస్ట్రార్‌గా బాధ్యతలు తీసుకుంటానని లేదంటే చేయనని వీసీకి స్పష్టం చేసినట్లు ఆమె తెలిపారు.

31లోగా మిల్లింగ్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం : ఈనెల 31లోగా రైస్‌మిల్ యజమానులు మిల్లింగ్ పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. బుధవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో సీఎంఆర్ లక్ష్యాలపై రైస్‌మిల్లుల యజమానులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేపట్టాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేయని రైస్‌మిల్లుల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్‌వో పద్మ, సివిల్ సప్లయ్ డీఎం అభిషేక్ సింగ్, ఎఫ్‌సీఐ డీఎంలు, జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమ్మె నోటీస్



సమ్మె నోటీస్‌ను అందజేస్తున్న డీలర్లు

కామారెడ్డి క్రైం : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైనందున జూన్ 5 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు రేషన్ డీలర్ల జేఏసీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం వారు కామారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చి సమ్మె నోటీస్‌ను అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఎస్‌వో పద్మకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లకు గౌరవ వేతనం, దిగుమతి హమాలీ చార్జీలు, కరోనా సమయంలో విధి నిర్వహణలో కరోనా సోకి చనిపోయిన 98 మంది డీలర్ల కుటుంబాలకు ఎక్స్‌గ్రేసియా రూ. 25 లక్షలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో నోటీసు అందజేశారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గౌరిశెట్టి రాజు, ఉపాధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌రావు, మాజీ అధ్యక్షుడు నాగం సురేందర్, వివిధ మండలాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

'భారతి సిమెంట్ సరైన ఎంపిక'



ధర్పల్లి: సిమెంట్ తయారీలో లేటెస్ట్ టెక్నాలజీ పద్ధతులను వినియోగిస్తూ తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంటును తెలంగాణలో విడుదల చేసిందని సంస్థ నిజామాబాద్ మేనేజర్ మీర్జా తెలిపారు. ధర్పల్లిలోని శ్రీ వెంగమాంబ నరసింహస్వామి సిమెంట్ షాపులో తాపీ మేస్త్రీలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. వినియోగదారులు కోరుకునే విధంగా నాణ్యమైన సిమెంటును అందించడంలో భారతి సిమెంట్ ఎప్పటికప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంటుతో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తి అవుతుందని, భవనాల స్లాబులు, పిల్లర్లు, వంతెనలు, రహదారుల నిర్మాణానికి అల్ట్రా ఫాస్ట్ సరైన ఎంపిక అని చెప్పారు. అల్ట్రా ఫాస్ట్ వినియోదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, భవనాల స్లాబ్ కాంక్రీట్ నిర్మాణ సమయంలో భారతి సిమెంట్ నిపుణులైన ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని వివరించారు. అనంతరం మండలానికి చెందిన 50 మంది మేస్త్రీలకు భారతి సిమెంట్ సంస్థ తరఫున రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్ పత్రాలను అందజేశారు. డీలర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను విక్రయిస్తే కేసులు



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అరికెళ్ల దేవయ్య

కామారెడ్డి క్రైం: ఆడపిల్లలను విక్రయిస్తే కేసులు నమోదు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అరికెళ్ల దేవయ్య అన్నారు. బుధవారం ఆయన కామారెడ్డికి వచ్చారు. ఆయనకు కలెక్టర్ జితేష్ వి పాటిల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా బాలల సంరక్షణ యూనిట్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన బాలల హక్కులు, సంరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలపై సమీక్షలో పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలను విక్రయించడం నేరమన్నారు. బాలల హక్కులను పరిరక్షించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. సంరక్షణ కేంద్రాల్లో ఉంటున్న బాలలను తల్లిదండ్రుల్లా చూసుకోవాలన్నారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, సంరక్షణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అడిషనల్ ఎస్పీ అన్యోన్య, సీడబ్ల్యూసీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, డీసీపీవో స్రవంతి, జిల్లా కార్మిక అధికారి సురేంద్ర కుమార్, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ పాల్గొన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



కామారెడ్డి అర్బన్ : పట్టణంలోని పంచముఖి హనుమాన్ దేవాలయం వద్ద రైల్వే అండర్ డ్రెయినేజీతో రోడ్డు కొట్టుకుపోయి అధ్వానంగా తయారైన విషయాన్ని ఈనెల 5న 'సాక్షి'లో కథనం ప్రచురించగా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. మరమ్మతులు ప్రారంభించారు. గతంలోనే ఈ రోడ్డుకు రూ. 2 కోట్లు మంజూరు కాగా టెండర్ ఖరారైంది. కాని పనులు చేపట్టడంలో జాప్యం జరిగింది. ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ పాత బస్టాండ్ నుంచి రంగంపేట రైల్వే గేటు వరకు సింగిల్‌రోడ్డును డబుల్ రోడ్డు చేయడంతో పాటు కల్వర్టులను విస్తరిస్తామన్నారు.

క్రైం కార్నర్

ఆస్తి పంచడం లేదని ఆత్మహత్యాయత్నం

దోమకొండ: తల్లిని గెంటేసి ఇంటికి తాళం వేసిన ఘటనలో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. దోమకొండ మండలం సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన బైకరి లచ్చవ్వ పెద్ద కుమారుడు పెద్ద నర్సయ్య అతడి కుమారులు మంగళవారం ఆస్తి పంపకం విషయంలో తల్లి లచ్చవ్వను ఇంట్లో నుంచి గెంటివేసి తాళం వేసిన విషయం తెలిసిందే. అడ్డు వచ్చిన తమ్ముడు చిన్న నర్సయ్యపై కూడా దాడి చేశారు. ఈ ఘటనలో బుధవారం పెద్ద నర్సయ్య కుమారుడైన నరేష్ తమ ఆస్తి పంపకం విషయంలో నానమ్మ, బాబాయి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కుల పెద్దలు చెప్పినా వినడం లేదని ఆరోపిస్తూ గ్రామ శివారులో సెల్ఫీ వీడియో తీసుకొని పురుగుల మందు తాగాడు. తమకు ఉమ్మడి ఇల్లు, వ్యవసాయభూమి ఉందని దానిని పంచుకుందామంటే నానమ్మ, బాబాయి కుదరనీయడం లేదన్నారు. తన చావుతోనైనా ఆస్తి పంపకాలు జరుగుతాయని పేర్కొంటూ పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అతడిని వెంటనే సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని, చికిత్స అందుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై సుధాకర్ తెలిపారు.

చెరువులో పడి బాలుడి మృతి

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ చెరువులో పడి ముదక్‌పల్లికి చెందిన ఒల్లెపు రాజు(16) మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. రాజు మోపాల్‌లో నరేష్ వద్ద గత ఏడాది నుంచి గేదెల కాపరిగా పనిచేస్తున్నాడు. మంగళవారం గేదెలను మేపడానికి సిర్‌పూర్ గ్రామ చెరువు సమీపానికి వెళ్లాడు. స్నానం కోసం చెరువులో దిగి మునిగి చనిపోయాడు. మృతుడి తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సాంపల్లి తండాకు చెందిన ఒకరు..

డిచ్‌పల్లి: మండలంలోని సాంపల్లి తండాకు చెందిన బదావత్ తార్య (40) గ్రామశివారులోని చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. తార్య తండాకు చెందిన వారి పశువు(గేదె)లను కాసేవాడు. బుధవారం ఉదయం గేదెలను తోలుకుని వెళ్లాడు. మధ్యాహ్నం ఎండకు గేదెలు చెరువునీటిలో దిగాయి. అవి బయటకు రాకపోవడంతో తార్య చెరువు నీటి వద్దకు వెళ్లి వాటిని తోలేందుకు యత్నించాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. చెరువులో పెద్ద పెద్ద మొరం గుంతలు ఉండటం, అతడికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. అక్కడే చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు గమనించి తార్యను నీటిలో నుంచి బయటకు తీశారు. అయితే అప్పటికే నీళ్లు మింగిన తార్య మృతి చెందాడు. మృతుడి చెల్లెలు నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్ శివారులో జాతీయ రహదారి 44 పక్కన గల పంట పొలాల్లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో లభించింది. ఎస్సై గోపి తెలిపిన వివరాలు.. కాయపల్లి శివన్న పొలంలో సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయస్సు గల యువకుడి మృతదేహం కనిపించింది. మృతుడి ఒంటిపై దుస్తులు లేవు. కుడి చేయికి కడెం, చెవికి రింగు ఉన్నాయి. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన మహంకాళి సాయిబాబా(33) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. సాయిబాబా మెకానిక్ పని చేస్తూ జీవిస్తాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఉరి వేసుకున్నాడు.

చోరీ కేసులో నలుగురి అరెస్ట్

- రూ.ఐదు లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కేసీఆర్ కాలనీలో గత నెల 28న రాత్రి జరిగిన దొంగతనం కేసును పట్టణ పోలీసులు ఛేదించారు. రాత్రిపూట ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి బంగారం, నగదు రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ స్కూల్ ప్రాంతంలో ఉన్న కేసీఆర్ కాలనీకి చెందిన అలకొండ సంతోష్ రెడ్డి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. 6.4 తులాల బంగారు ఆభరణాలు, రూ లక్ష నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు సంతోష్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా నలుగురు రెండు బైకులపై వచ్చి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలు, కొత్తగా వచ్చిన సీఈఐఆర్ టెక్నాలజీ, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తులు హైదరాబాదులోని దమ్మాయిగూడ శామీర్‌పేటకు వెళ్లినట్లు గుర్తించారు. వారిని మంగళవారం అరెస్టు చేసి విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫిరోజ్, బొమ్మని రాములమ్మ అశోక్, సదల భరత్‌కుమార్, తెనుగు మహేందర్‌గా గుర్తించారు. నిందితుల్లో ఫిరోజ్ పాత నేరస్తుడు. హైద్రాబాద్, విజయవాడలలో జరిగిన పలు కేసుల్లో నిందితునిగా ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి చోరీకి గురైన 6.4 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు సహా మొత్తం రూ.5 లక్షల సొత్తును రికవరీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన డీఎస్పీ సురేష్, పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్, సీసీఎస్ సీఐ మల్లేష్ గౌడ్, టౌన్ ఎస్సైలు రాజు, సాయిరెడ్డి, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, ఏఎస్ఐ రాజేశ్వరరావు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ధాన్యం బస్తాల లారీ బోల్తా



నాగిరెడ్డిపేట: మండలంలోని తాండూర్‌లో గల కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాల లోడుతో బయలుదేరిన లారీ బుధవారం మండలంలోని గోపాల్‌పేట సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. మండలంలోని తాండూర్‌లోని కొనుగోలు కేంద్రం నుంచి 630బస్తాల లోడుతో లారీ భిక్కనూరు మండలంలోని బస్వాపూర్‌లో గల రైస్‌మిల్లులకు బయల్దేరింది. కమాన్‌పట్టీలు విరిగిపోవడంతో లారీ బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న తాండూర్ సొసైటీ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ధాన్యం బస్తాలను మరోలారీలో నింపి రైస్‌మిల్లుకు పంపించారు.

దాడి ఘటనలో కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డాక్టర్ పై దాడి, అద్దాలు ధ్వంసం చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు పంటల దగ్ధం



కాలిపోయిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

లింగంపేట: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన ఎరుకల ఎల్లవ్వ కౌలుకు తీసుకుని సాగు చేసిన వరి పంట అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. రెండు రోజుల వ్యవధిలో పంట కోయాలనుకుంటే.. మంగళవారం సాయంత్రం కాలిపోయిందని బాధితురాలు వాపోయింది. కౌలు చేసిన 38 గుంటల్లో సగం వరకు కాలిపోయినట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారా.. ప్రమాదవశాత్తు కాలిపోయిందా అని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. విషయాన్ని ఏవో అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఏఈవో రమ్య పంట చేనుకు వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. సుమారు పది గుంటల వరకు కాలిపోయినట్లు తెలిపారు.

మొక్కజొన్న పంట..

బాన్సువాడరూరల్: మండలంలోని పులిగుండు తండాకు చెందిన ఇస్యానాయక్ 4.20 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. కోతకొచ్చిన పంటలో సుమారు 1.20 ఎకరాలు బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. కాలిపోయిన పంటను ఏఈవో కొండ మీన పరిశీలించారు.